RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 249 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | బుధవారం, 13 మార్చి 2024 | పేజీలు : 4 | వెల : 2/-



## పేదలకు.. తియ్యటి శుభవార్త

# తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు..

# తెల్ల రేషన్ కార్డులపై ఫైనల్‌గా ఇలా..!

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం నాడు క్యాబినెట్ భేటీ జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు సీఎం రేవంత్, మంత్రులు అమోదం తెలిపారు. ఈ భేటికి సంబంధించిన వివరాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి , శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ మీడియాకు తెలిపారు.

**కీలక నిర్ణయాలివే...** ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు, పార్టీలకు అతీతంగా పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు, మొదటి విడతలో 22,500 కోట్ల రూపాయలతో 4,50,000 ఇండ్లు, తెల్ల రేషన్ కార్డులకు అమోదం, కొత్తగా 14 బీసీ కులాలకు కార్పొరేషన్ల ఏర్పాటు, మహిళ సంఘాలు చేసిన వస్తువుల బ్రాండింగ్ కోసం ORR చుట్టూ 30 ఎకరాల స్థలం, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన ఇరిగేషన్ అవకతవకలపై విచారణ కోసం జస్టిస్ పినాకిని చంద్ర ఘోష్‌తో కమిటీ, వంద రోజుల్లో ఇరిగేషన్‌పై విచారణ జరిపించాలని క్యాబినెట్‌లో నిర్ణయం. 16 కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు. ముదిరాజ్, యాదవ కుర్మ, లింగాయత్, పద్మశాలి, పెరక, బలిజ, రెడ్డి, వైశ్య, మాదిగ, మాదిగ ఉపకులాల, మాల, మాల ఉపకులాలు, ఏకలవ్య, బంజారా, ఆదివాసీల కోసం ప్రత్యేక కార్పొరేషన్ల ఏర్పాటు. గీత కార్మికుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు. 2008 డీఏస్సీ అభ్యర్థులకు మినిమం పే స్కేల్ ఇచ్చి ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయం. వేసవిలో తాగునీటి కోసం ఇబ్బంది లేకుండా జాగ్రత్త తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మహిళా సాధికారత కోసం 15 అంశాలతో ప్రత్యేక కార్యక్రమం కోసం క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తెలిపారు.

కేబినెట్ భేటీ అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మీడియాతో ఏమన్నారంటే.. "ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులందరం ఒక టీమ్‌గా పని చేస్తున్నాం. మేము ఎన్నికల కోసం నిర్ణయాలు తీసుకోవడం లేదు. ప్రజల కోసం నిర్ణయాలు తీసుకుంటున్నాం. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోపే చెప్పినవి చేస్తున్నాం. బావబామ్మర్దులు(కేటీఆర్, హరీశ్‌రావులని ఉద్దేశించి) జాగ్రత్తగా మాట్లాడాలి. ఇకనైనా బీఆర్ఎస్ నేతలు ప్రతిపక్ష పాత్ర పోషించాలి. గులాబీ నేతలు రోజూ ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఊరుకోం. వారు మాట్లాడకపోతే మేము ఆర్థిక క్రమశిక్షణతో ఉంటాం. మాజీ సీఎం కేసీఆర్ లక్ష అబద్ధాలు చెప్పాడు" అని మంత్రి కోమటి రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మహిళల భద్రత కోసం...

# 'టీ- సేఫ్ ' యాప్



హైదరాబాద్ : దిశ యాప్ వంటి సరికొత్త యాప్‌ను తెలంగాణ ప్రభుత్వం రూపొందించింది. దీనికి టీ- సేఫ్ అని పేరు పెట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మధ్యాహ్నం ఈ యాప్‌ను ఆవిష్కరించారు. దీనిపై ప్రజల్లో అవగాహన, చైతన్యం కల్పించడానికి వీలుగా మహిళా పోలీసు భద్రతా విభాగం రూపొందించిన పోస్టర్‌ను విడుదల చేశారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, దామోదర్ రాజనర్సింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవి గుప్తా.. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళల భద్రత, ప్రయాణ సమయంలో వారిని పర్యవేక్షించడానికి వీలుగా టీ- సేఫ్ యాప్‌ను రూపొందించినట్లు మంత్రులు తెలిపారు. మహిళలు ఒంటరిగా ప్రయాణించే సందర్భాల్లో తక్షణ సహాయాన్ని అందించడానికి, లైవ్ లొకేషన్ షేర్ చేయడానికి, ప్రయాణమార్గం నావిగేట్ చేయడానికి, ఆకస్మిక మార్పులు జరిగినప్పుడు పసిగట్టి పోలీసులు అప్రమత్తం కావడానికి వీలైన అనేక ప్రత్యేక ఫీచర్లను టీ-సేఫ్ యాప్‌లో ఉన్నట్లు చెప్పారు.

## కాంగ్రెస్ పాలన చూస్తే సమైక్య పాలకులే నయమనిపిస్తోంది: కేసీఆర్

కరీనంగర్: భారాస తెలంగాణ బలం.. తెలంగాణ గళం అని ఆ పార్టీ అధినేత కేసీఆర్ అన్నారు. 'కరీంనగర్ కదన భేరి' సభతో ఎన్నికల ప్రచారానికి ఆ పార్టీ శ్రీకారం చుట్టింది. "రైతుల దయనీయ పరిస్థితి చూస్తే కన్నీళ్లు వస్తున్నాయి. పంటలు ఎండిపోతున్నా పాలకులకు దయరావట్లేదు. మూడు నెలల్లో పాలకులు రాష్ట్రాన్ని ఆగం



చేశారు. కాంగ్రెస్ పాలన చూస్తే సమైక్య పాలకులే నయమనిపిస్తోంది. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దిల్లీకి తాకట్టు పెడుతున్నారు. తెలంగాణలో మొన్న నేను గెలిచి ఉంటే.. దేశాన్ని చైతన్యం చేసేవాణ్ణి. కేసీఆర్ దిగిపోగానే కరెంట్, రైతు బంధు కట్ అయ్యాయి. ఈ ప్రభుత్వం కరెంటు, రైతు బంధు ఇవ్వలేకపోతోంది. పోలీసులకు రాజకీయాలు ఎందుకు? సోషల్ మీడియాలో పోస్టులు పెడితే అరెస్టులు చేస్తున్నారు. గ్రామాల్లో చిచ్చు పెట్టొద్దు. మేం అలా చేస్తే కాంగ్రెసోళ్లు మిగిలేవారా? ఒక పన్ను వదులైతే మొత్తం రాలగొట్టుకుంటామా? కాళేశ్వరంలో ఇసుక జారి రెండు పిల్లర్లు కుంగితే దేశమే మునిగిపోతోందని రచ్చ చేస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో టీవీలో వస్తా.. కాళేశ్వరంపై వివరిస్తా. ముఖ్యమంత్రిని ఆరు గ్యారంటీలు అడిగితే.. పండబెట్టి తొక్కుతా, పేగులు మెడలో వేసుకుంటా, మానవ బాంబు అవుతా అంటున్నారు. ఉద్యమ సమయంలో నేనూ పరుషంగా మాట్లాడా.. కానీ, సీఎం అయిన తర్వాత అలా మాట్లాడలేదు. తమాషాకు ఓటేయొద్దు.. ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. కరీంనగర్‌లో వినోద్‌ను గెలిపించాలి" అని కేసీఆర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కోటి మంది మహిళల్ని కోటీశ్వరులను చేస్తాం: రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: తెలంగాణలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆడబిడ్డల ఆశీర్వాదం వల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన సభలో 'మహాలక్ష్మి స్వశక్తి మహిళ' పథకాన్ని సీఎం ప్రారంభించారు. "మాట తప్పకుండా.. మడమ తిప్పకుండా సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారు. ప్రత్యేక రాష్ట్రం ఇస్తే ఏపీలో పార్టీకి తీవ్ర నష్టమని తెలిసినా మనకు రాష్ట్రం ఇచ్చారు. కానీ, కేసీఆర్ పదేళ్లపాటు మహిళలు, ఆడబిడ్డలను పట్టించుకోలేదు. అందుకే మహిళల ఉసురు తగిలి ఆయన పదవి పోయింది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తే.. కేసీఆర్ కుటుంబానికి కడుపుమంటగా ఉంది. ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణం వద్దంటూ ఆటో డ్రైవర్లతో ధర్నా చేయించారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించే రాజీవ్ ఆరోగ్యశ్రీని కేసీఆర్ నిర్వీర్యం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆ పథకాన్ని రూ.10లక్షలకు పెంచాం. కేసీఆర్, మోదీ కలిసి రూ.400 ఉన్న గ్యాస్ సిలెండర్‌ను రూ.1200 చేశారు. మహిళలకు భారం కావొద్దని మళ్లీ రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నాం. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తానని కేసీఆర్ పదేళ్లు డబ్బా కొట్టారు. పదేళ్లలో ఎంతమందికి ఇచ్చారో చెప్పాలి. మహిళా సంఘాల కోసం ప్రత్యేకంగా 100 మార్కెట్లు నిర్మించి, వారి ఉత్పత్తుల విక్రయం కోసం స్టాళ్లు ఏర్పాటు చేయిస్తాం. సీఎం కుర్చీలో పాలమూరు బిడ్డ కూర్చుంటే కొందరికి కడుపు మండుతోంది. మహిళలు గెలిపించిన ప్రభుత్వాన్ని కూలగొట్టాలని కేసీఆర్, మోదీ కలిసి కుట్రలు చేస్తున్నారు. రైతుల పంటలు కొనని మోదీకి ఎందుకు ఓటు వేయాలి.

ఏటా రెండు కోట్ల మందికి ఉద్యోగాలు ఇస్తామని మోదీ అన్నారు. ఈ పదేళ్లలో 20 కోట్ల మందికి ఉద్యోగాలు ఇచ్చారా? తెలంగాణ ఏర్పాటును ఆయన ఎన్నోసార్లు అవమానించారు. సోనియాగాంధీ పార్లమెంట్ తలుపులు మూసివేసి తెలంగాణ ఇచ్చారని విమర్శించారు. రాష్ట్ర ప్రజల చిరకాల కోరిక నెరవేరాలని తలుపులు మూసి బిల్లు పాస్ చేయించారు" అని సీఎం వివరించారు.




# వాళ్లవి ఓటుబ్యాంకు రాజకీయాలు

## మూడు పార్టీలపై నిప్పులు చెరిగిన కేంద్రమంత్రి అమిత్ షా

హైదరాబాద్: తెలంగాణ ప్రజల ఉత్సాహం చూస్తుంటే మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా అన్నారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన భాజపా బూత్ స్థాయి అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మోదీని మూడోసారి ప్రధానిగా చేద్దామా. 400 ఎంపీ సీట్లను ఆయనకు కానుకగా ఇద్దామా.. అంటూ పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. "ప్రస్తుతం దేశంలో ఎక్కడికి వెళ్లినా మోదీ నామస్మరణే. మజ్లీస్ అజెండాతోనే కాంగ్రెస్, భారాస పనిచేస్తాయి. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మజ్లీస్‌కు భయపడుతోంది. కాంగ్రెస్, భారాస, మజ్లీస్.. మూడూ వారసత్వ పార్టీలే. అవి కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలే చేస్తాయి. ఓబీసీల గురించి ఆ మూడు పార్టీలు ఎప్పుడైనా ఆలోచించాయా? కేవలం వారసుల సంక్షేమం గురించి మాత్రమే ఆలోచిస్తాయి. కాంగ్రెస్ పాలన అంతా కుంభకోణాల మయం.

తెలంగాణ ప్రజలు భాజపాకు 12 ఎంపీ సీట్లు తగ్గకుండా ఇవ్వాలి. మోదీ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో ఏడాదికి రూ.6వేల చొప్పున వేస్తూ.. అండగా ఉంటోంది. వచ్చే ఐదేళ్లలో దేశమంతటా.. ప్రతి ఇంటికి నల్లా ద్వారా మంచినీరు ఇస్తాం. ఇప్పటికే 14 కోట్ల ఇళ్లకు మంచినీటి నల్లా కనెక్షన్లు ఇచ్చాం. పదేళ్ల యూపీఏ పాలనలో తెలంగాణకు రూ.1.17లక్షల కోట్లు మాత్రమే వచ్చాయి. మోదీ పాలనలో ఇప్పటికే రాష్ట్రానికి రూ.5లక్షల కోట్లు వచ్చాయి. భాజపా ఎప్పుడూ ఓటు బ్యాంకు రాజకీయాలు చేయదు" అని వివరించారు.

**కాంగ్రెస్ నేతలు వసూళ్లకు పాల్పడుతున్నారు: కిషన్‌రెడ్డి –** "మోదీ నేతృత్వంలోనే దేశం ఎంతో అభివృద్ధి చెందింది. రాష్ట్ర అభివృద్ధికి మోదీ నిధులు కేటాయించారు. కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోచుకున్నది. కేసీఆర్ నియంతృత్వ పాలనతో రాష్ట్రాన్ని ఎదగనివ్వలేదు. ఈసారి రాష్ట్రంలోని 17 లోక్‌సభ సీట్లు భాజపా గెలవాలి. మజ్లీస్ పీడ తొలగాలని పాతబస్తీ వాసులు కోరుకుంటున్నారు. రాహుల్ గాంధీ, పార్లమెంట్ ఎన్నికల కోసం కాంగ్రెస్ నేతలు తెలంగాణలోని బిల్డర్లు, కాంట్రాక్టర్లు, వ్యాపారుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారు" అని కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆరోపించారు.

**శ్రీరాముడి వారసుడే మా ప్రధాని అభ్యర్థి: బండి సంజయ్ –** "శ్రీరాముడి వారసుడే మా ప్రధాని అభ్యర్థి. కాంగ్రెస్ పార్టీ ప్రధాని అభ్యర్థి ఎవరో ఇప్పటికీ చెప్పలేని పరిస్థితి.

వంద రోజులు దాటిన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి చుక్కలు కనిపిస్తాయి. ఆరు గ్యారంటీలు అమలు చేయాలంటే రూ.5లక్షల కోట్ల బడ్జెట్ కావాలి. రేషన్‌కార్డు నిబంధన పెట్టి లబ్ధిదారులకు కోత పెడుతున్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ గురించి కాంగ్రెస్ నేతలు మాట్లాడటం లేదు. నిరంతరం ప్రజాసమస్యలపై పోరాడి జైలుకు వెళ్లింది భాజపా కార్యకర్తలు. మా శ్రేణులు ఎప్పుడూ కుటుంబాల గురించి ఆలోచించలేదు" అని భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## సీఈసీ అరుణ్ గోయల్ రాజీనామాకు ముందు ఏం జరిగింది?

రోజుల వ్యవధిలోకి లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ గడువు ముంచుకొచ్చేసిన వేళలో.. కేంద్ర ఎన్నికల సంఘంలో ఉన్న ఇద్దరు కమిషనర్లలో ఒకరు పదవీకాలం ముగిసిన కారణంగా తమ పదవికి దూరమైతే.. అరుణ్ గోయల్ తన పదవీ కాలం మరో రెండేళ్లు ఉన్నప్పటికీ ఆకస్మికంగా రాజీనామా చేయటం షాకింగ్ గా మారటమే కాదు.. పెను సంచలనానికి తెర తీసింది. కీలకమైన ఎన్నికల ముందు రాజీనామా చేసిన వైనంలో ఆయన తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని బీజేపీ ముఖ్యుల నుంచి ఒత్తిడి వచ్చినప్పటికీ ఆయన ససేమిరా అనటం ఆసక్తికరంగా మారినట్లు చెబుతున్నారు. ఇక్కడో విషయాన్ని ప్రస్తావించాలి. అరుణ్ గోయల్ ను కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ గా నియమించినప్పుడే పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ప్రభుత్వ శాఖల్లో కీలక బాధ్యతలు నిర్వహించిన గోయల్ 2022లో స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. అనంతరం.. ఆయన్ను ఏరికోరి కేంద్రం సిఫార్సు చేయటం.. ఆయన కేంద్ర ఎన్నికల కమిషనర్ గా ఎంపిక కావటం తెలిసిందే. ఆయన ఎంట్రీ వివాదాస్పదం అయితే.. ఆయన అనూహ్య రాజీనామా (ఎగ్జిట్) సైతం చర్చనీయాంశంగా మారింది. ముక్కుసూటి మనిషిగా.. తనకు తాను తప్పించి.. తననెవరూ ప్రభావితం చేసేందుకు అవకాశం ఇవ్వని అరుణ్ గోయల్.. తన రాజీనామా విషయంలోనూ అదే తీరును ప్రదర్శించారని చెబుతారు. రూల్ మాస్టర్ గా ఆయన్ను ఎన్నికల సంఘం అధికారులు అభివర్ణిస్తుంటారు. మరి.. అలాంటి ఆయన కీలకమైన లోక్ సభ ఎన్నికలకు రోజుల ముందు పదవికి రాజీనామా చేయటం దేనికి నిదర్శనం? అన్నదిప్పుడు ప్రశ్న. గోయల్ రాజీనామాకు ముందు అసలేం జరిగిందన్నది ఇప్పుడు మిస్టరీగా మారింది. ఆయన చివరి పని దినాల్ని చూసినప్పుడు.. మార్చి 5న పశ్చిమ బెంగాల్ లో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మీడియా భేటీకి హాజరు కావాల్సి ఉంది. కానీ.. ఆయన మాత్రం హాజరు కాలేదు. ఎందుకలా? అన్న ప్రశ్నకు ఆయన ఆరోగ్యం బాగోలేదని అప్పట్లో వివరణ రూపంలో వినిపించినా.. అందులో నిజం లేదని.. ప్రధాన ఎన్నికల కమిషనర్ తో తనకున్న విభేదాల కారణంగానే ఆయన తన పర్యటనను కుదించుకొని బెంగాల్ నుంచి ఢిల్లీకి వెళ్లిపోయినట్లుగా సమాచారం. అరుణ్ గోయల్ ఆకస్మిక రాజీనామా వెనుక.. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ తో ఉన్న విభేదాలే కారణమని చెబుతున్నారు. ఇదిలా ఉంటే.. మార్చి 7న కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో లోక్ సభ ఎన్నికలకు సంబంధించి ఒక సమావేశాన్ని నిర్వహించారు. దీనికి కేంద్ర చీఫ్ ఎన్నికల కమిషనర్ తో పాటు అరుణ్ గోయల్ సైతం హాజరయ్యారు. ఆ తర్వాతి రోజున ఎన్నికల ఏర్పాట్లపై ఈసీ అధికారులు.. కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా మధ్య సమావేశం జరిగింది. ఈ రోజున అనూహ్యంగా అరుణ్ కుమార్ గైర్హాజరయ్యారు. అయితే.. అప్పుడు కూడా ఆయన అనారోగ్యంతో ఉన్నట్లుగా ప్రచారం జరిగింది. అయితే.. ఆయనకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని చెబుతున్నారు. మరి.. అలాంటప్పుడు ఆయనకు ఆరోగ్య సమస్యలు ఉన్నట్లుగా ప్రచారం చేసిందెవరు? అన్నది ప్రశ్న. అంతేకాదు.. ఆయన తన రాజీనామాను నేరుగా ప్రభుత్వానికే పంపారే తప్పించి.. కేంద్ర ఎన్నికల సంఘానికి కానీ.. సీఈసీకి కానీ సమాచారం ఇవ్వకపోవటం గమనార్హం. ఆయన రాజీనామాను రాష్ట్రపతి ఓకే చేయటం.. శనివారం ఆయన రాజీనామా ఆమోదానికి సంబంధించిన గెజిట్ వెలువడే క్రమంలో కూడా కేంద్రంలోని పలు ముఖ్య శాఖలకు చెందిన వారికి కూడా సమాచారం లేదని చెబుతున్నారు. ఆయన తన పదవికి రాజీనామా చేసిన విషయం గురించి తెలిసిన వారంతా షాక్ తిన్న పరిస్థితి. అరుణ్ గోయల్ కు కాస్త ముందుగా మరో ఎన్నికల కమిషనర్ గా ఉన్న అనుప్ చంద్ర పాండే పదవీ కాలం పూర్తి కావటంతో ఆయన పదవి నుంచి తప్పుకున్నారు. అప్పటివరకు మూడుగా ఉన్న కమిషన్ సంఖ్య రెండుగా అయితే.. తాజాగా అరుణ్ గోయల్ రాజీనామాతో ఒకే ఒక్కడుగా కేంద్ర ఎన్నికల కమిషన్ లో నిలిచారు. మొత్తంగా అరుణ్ గోయల్ ఆకస్మిక రాజీనామాకు సంబంధించిన తెర వెనుక పెద్ద కారణం ఉండి ఉండాలన్న వాదన రాజకీయ వర్గాల్లోనూ.. అధికార వర్గాల్లోనూ చర్చ జరుగుతోంది. అదిప్పట్లో రివీల్ అయ్యే అవకాశం లేదని చెబుతున్నారు.

## ఆశ్రమాల్లో సకల సౌకర్యాలు కల్పించి విద్యార్థుల ఆరోగ్యం పై దృష్టి పెట్టాలి

### అధికారులను ఆదేశించిన కలెక్టర్





**ఆదిలాబాద్ మార్చి 12(ప్రభాత సమాచారం)** గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలలు , గురుకులా లలోని విద్యార్థుల ఆరోగ్యం, త్రాగునీటి వసతి, బియ్యం, ఇతర ఆహార పదార్థాల నాణ్యత పై జిల్లాలోని అన్ని ఆశ్రమ పాఠశాలల , గురుకులాల ప్రధానోపాధ్యాయులు వసతి గృహ సంక్షేమ అధికారులతో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఐటిడిఎ పి ఓ ఖుష్బూ గుప్తా తో కలసి సమీక్షించారు.సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లాలో గల అన్ని ఐటిడిఎ గిరిజన ఆశ్రమ పాఠశాల ల్లో గురుకుల పాఠశాలలో కావలసిన అవసరమైన మౌలిక సదుపాయాల పై. ప్రతి స్కూల్ కి సంబందించిన అధికారులను అడిగి తెలుసు కున్నారు.తాగునీటిని, మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేయాలని, ఆర్వో ప్లాంట్స్ రిపర్స్ ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని, ఎక్కడా కూడా ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.అలాగే విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ద వహించి ఎప్పటికప్పుడు విద్యార్థుల ఆరోగ్యం పై ఆరా తీయాలని, ప్రతీ గురువారం పీహెచ్సి మెడికల్ ఆఫీసర్స్ ఫీల్డ్ విసిట్ చేయాలని, అనారోగ్యం, ఎనీమియా తో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్యం అందించాలని అన్నారు ప్రతీ మొదటి గురువారం ఒక స్కూల్ పర్యటించి మినిమం విద్యార్థులను పరీక్షించి మిగిలిన విద్యార్థులను మరుసటి గురువారం పరీక్షించాలని తెలిపారు. షెడ్యూల్ తయారు చేసుకొని ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలని ఆదేశించారు. అలాగే 5 పిహెచ్ సి లలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కేంద్రాలు ప్రతీ మంగళవారం క్యాంపులు నిర్వహించి ఆరోగ్య కార్డులు అందించాలని అన్నారు.అలాగే ఆహార విషయంలో ప్రత్యేక శ్రద్ద వహించి నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, సివిల్ సప్లై ద్వారా సరఫరా చేస్తున్న ఫ్యురిఫైడ్ బలవర్ధకమైన బియ్యాన్ని వృధా కాకుండా పదిహేను నిమిషాలు బియ్యం నానబెట్టడం వల్ల పైన తేలుతున్న బియ్యం కలసి పోతాయని దీనివల్ల మంచి పోషకాలు అందుతాయని అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సివిల్ సప్లై శాఖ నుండి స్కూల్ లో శిక్షణ ఇవ్వాలని ఇందులో అందరూ పాల్గొనేలా చూడాలనీ అన్నారు.ప్రతీ హాస్టల్ లో త్రాగునీరు, ఆరోగ్యం, ఆహార విషయం లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని నాణ్యమైన సరుకులు అందించాలని తెలిపారు.పెండింగ్ పనులు మరమ్మత్తులు లాంటివి ఏమైన ఉంటె ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అన్నారు.

## పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు జిల్లా కలెక్టర్లు సంసిద్ధంగా ఉండాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్





**ఆదిలాబాద్ మార్చి 12(ప్రభాత సమాచారం)** రానున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు జిల్లా కలెక్టర్లు అన్ని ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు.మంగళవారం ఆయన హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ విషయమై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు జాబితాపై వచ్చిన అన్ని ఫిర్యాదులను విచారణ జరిపి ఎలాంటి తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ముద్రణకు ప్రింటింగ్ ప్రెస్ ను ముందే గుర్తించాలని, పార్లమెంటు ఎన్నికల్లో హోమ్ ఓటింగ్ ప్రక్రియ సక్రమ నిర్వహణకు సరైన ప్రణాళిక ముందు నుంచి సిద్ధం చేసుకోవాలని, ఈ విషయంలో ఎలాంటి తప్పులు చేయవద్దన్నారు. పోలింగ్ రోజు రికార్డింగ్ కోసం సరైన వెబ్ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అంతేకాక ఎన్నికల నోటిఫికేషన్ వేలువడినప్పటి నుండి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో బాగంగా అవసరమైన వీడియో సర్వేలెన్సు, వీడియో వీక్షణ తదితర పనుల కోసం అవసరమైన కెమెరాలను ముందే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వ్యతిరేక వార్తలకు ఎప్పటికప్పుడు స్పందించి ఎన్నికల సంఘానికి పంపించే బాధ్యతను జిల్లా కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మోడల్ పోలింగ్ కేంద్రాలను బాగా తీర్చిదిద్దారని, అదేవిధంగా పార్లమెంటు ఎన్నికలలో సైతం మంచి మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఇందుకు ముందే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, మోడల్ పోలింగ్ కేంద్రాలపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఆర్ ఓ కార్యాలయంతో పాటు, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో కమ్యూనికేషన్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సమాచారాన్ని ఈనెల 13 లోగా పంపించాలని, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది డేటా అప్డేషన్ పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు.అడిషనల్ సీఈవో లోకేష్ , సర్ఫరాజ్ అహ్మద్ లు మాట్లాడుతూ ఓటరు జాబితా , పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ స్టేషన్లో మౌలిక సదుపాయాలు, వివిధ రకాల నోడల్ టీములకు ఇచ్చే శిక్షణ కార్యక్రమాలు , ఎన్నికల వెలువడిన తర్వాత ప్రతిరోజు సమర్పించే నివేదికలు, పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే మీడియా సమావేశం, పొలిటికల్ పార్టీల కు సమాచారం, డీ ఫేస్ మెంట్ ,అనుమతులు, ఫిర్యాదుల పరిష్కారం ,ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, సెక్టోరల్ అధికారుల నియామకం, హోమ్ ఓటింగ్, నామినేషన్ల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ,తదితర అంశాలపై వివరించారు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ట్రైనీ కలెక్టర్ వికాస్ మెహతో. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మల్లేష్ కుటుంబానికి 50వెలు ఆర్థిక సహాయం చేసిన ఎమ్మెల్యే



**ఉట్నూర్ మార్చి 12(ప్రభాత సమాచారం)** హైదరాబాద్ లోని సోమాజిగూడలో గల యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముంజం మల్లేష్ ను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సోమవారం రాత్రి పరామర్శించారు.ఆరోగ్య పరిస్థితులపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి బాధితుడికి మెరుగైన వైద్యాన్ని అందించాలని సూచించారు. ఆర్థికంగా రోగికి ఇబ్బందులకు గురి చేయోదన్నారు.ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు 50వేల ఆర్థిక సాయాన్ని తనవంతుగా అందజేశా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## పీసీబీలో ఏం జరుగుతుంది..?

హైదరాబాద్ : పరిశ్రమలు నెలకొల్పాలన్నా, ఆ పరిశ్రమలను నిర్వహించాలన్నా కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) నుంచి కన్సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్ (సీఎఫ్ఈ), కన్సెంట్ ఫర్ ఆపరేషన్ (సీఎఫ్‌వో) అనుమతులు తప్పనిసరి. వీటి జారీ చేస్తున్న అధికారులపై పర్యవేక్షణ లేకపోవడం పీసీబీలోని కొందరికి వరంగా మారింది. ప్రభుత్వ ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉండని కారణంగా అనుమతుల రెన్యువల్ కోసం వచ్చే వారి ఫైళ్లను నెలల తరబడి పెండింగ్ పెడుతున్నారన్న ఆరోపణలున్నాయి. సాధారణంగా పరిశ్రమల నిర్వాహకులు 3, 5, 7 ఏళ్లకోసారి రెన్యువల్ చేయించుకోవాలి. నిబంధనల ప్రకారం కాలుష్య నియంత్రణ ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా..? పరిశీలించి అవసరమైతే బృందాన్ని పంపి శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపి రిపోర్టు ఆధారంగా అనుమతులు రెన్యువల్ చేయాలి. కానీ అవేవీ జరగడం లేదన్న ఆరోపణలున్నాయి.

తీవ్రంగా పరిగణించిన హైకోర్టు

కాలుష్య నియంత్రణ మండలిలో పీసీబీ అధికారుల తీరుపై హైకోర్టు సైతం ఆగ్రహం వ్యక్తం చేసింది. పీసీబీ ఇచ్చిన షోకాజ్ నోటీసుకు వివరణ ఇచ్చినా ఇవ్వలేదంటూ ఫిబ్రవరి 15న మూసివేత ఉత్తర్వులు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ రంగారెడ్డి జిల్లాలోని ఫ్రోస్టర్స్ అనే సంస్థ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. విచారించిన ధర్మాసనం ఒక అధికారి నోటీసులు జారీచేయడం, మరో అధికారి మూసివేత ఉ



త్తర్వులు ఇవ్వడమేమిటని ప్రశ్నించింది. జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరుపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అతన్ని కొనసాగిస్తే కోర్టు ధిక్కరణగా తీసుకొని ఉత్తర్వులు జారీ చేస్తామని వ్యాఖ్యానించింది. 7 నెలలుగా పీసీబీ పనితీరు దారుణంగా ఉందని, సమర్థుల్ని నియమించాలని హితవు పలికింది.

ఆ అధికారి ఎప్పుడొస్తారో తెలియదు

మేడ్చల్ జిల్లాకు సంబంధించిన ఓ అధికారి వద్దకు అనుమతుల కోసం ఎప్పుడు వచ్చినా అందుబాటులో ఉండరనే ఆరోపణలున్నాయి. జిల్లాలో సుమారు 5వేలకుపైగా పరిశ్రమలున్నట్టు అంచనా. ఏటా 300–400 కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అనుమతుల కోసం దరఖాస్తులు వస్తుంటాయి. గ్రీన్, ఆరెంజ్, రెడ్ కేటగిరీలు ఉండగా.. గ్రీన్ కేటగిరీకి దరఖాస్తు వచ్చిన వారం రోజుల్లో, ఆరెంజ్‌కు 14 రోజులు, రెడ్‌కు 21 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలి. వీటిని సదరు అధికారి పట్టించుకోరన్న విమర్శలున్నాయి.

ఆకస్మిక తనిఖీలు చేసి ఎన్నాళ్లైందో

పరిశ్రమల్లో కాలుష్యంపై నిరంతరం నిఘా ఉంచాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరు వ్యర్థాలను చెరువులు, కుంటలు, మైదానాల్లోకి వదిలేయడంతో జలాశయాలు, భూగర్భజలాలు కలుషితమవుతున్నాయి. జీడిమెట్ల, పటాన్‌చెరు, నాచారంలోని ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో రిజిస్టర్ అయిన పరిశ్రమలకు, తరలిస్తున్న వ్యర్థాలకు పొంతన లేదు. నాచారం పరిధిలో 10ఏళ్లుగా చర్యలు శూన్యం. ఇక్కడ రసాయన మిశ్రమాలు, ప్లాస్టిక్, మెటల్, రబ్బర్ వంటి 700 పరిశ్రమలున్నాయి. మన సీఈటీపీలో రిజిస్టరయినవి 200 మాత్రమే. మిగిలిన వాటి వ్యర్థాల శుద్ధి ఎలా జరుగుతుందో రహస్యమే.

## ఆ కొంత దూరం ఏడుపే

సూర్యాపేట : సూర్యాపేట శివారులోని కేసారం నుంచి మోల్కపట్నం వరకు రహదారి నిర్మించినా.. ఇరువైపులా ముళ్లచెట్లు విపరీతంగా పెరగడంతో ప్రయోజనం లేకుండా పోయింది. ఈ మలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. వీటి వద్ద సూచికలూ ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

సూర్యాపేట జిల్లా కేంద్రం నుంచి నల్గొండ జిల్లా మిర్యాలగూడ వెళ్లే రహదారి నిర్మాణం పనులు ఎనిమిదేళ్లయినా పూర్తికావడం లేదు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కొలువు దీరిన భారాస ప్రభుత్వం నియోజకవర్గాలను కలిపేందుకు అనుసంధాన రహదారుల(లింక్ రోడ్ల)ను ఆధునికీకరించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మిర్యాలగూడ, నకిరేకల్, సూర్యాపేట నియోజకవర్గాలను కలిపేందుకు సూర్యాపేట నుంచి నల్గొండ జిల్లా భీమారం మీదుగా 32 కిలోమీటర్ల రహదారి నిర్మాణం కోసం 2016లో రూ.32 కోట్లు మంజూరు చేసింది. భీమారం, ఆమనగల్ గ్రామాలు పంచాయతీరాజ్ శాఖ పరిధిలో.. మిగిలినవి ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో ఉండటంతో నాలుగు నెలలు ఆలస్యంగా పనులు మొదలయ్యాయి. ప్రభుత్వం ఈ రహదారి నిర్మాణ బాధ్యతలను ఆర్‌అండ్‌బీ శాఖకు అప్పగించడంతో సూర్యాపేట అధికారులు టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు.

అసంపూర్తిగా ఏడు కి.మీ. రహదారి

సూర్యాపేట నుంచి కేసారం, భీమారం మీదుగా.. నల్గొండ జిల్లా మోల్కపట్నం వరకు 25 కిలోమీటర్లు మేర రహదారి నిర్మించారు.



మధ్యలో కల్వర్టులు కట్టలేదు. పూర్తయిన పనులకు రూ.25 కోట్లు విడుదలయ్యాయి. భీమారం వద్ద బైపాస్‌తో పాటు, మిగిలిన ఏడు కి.మీ. రహదారి, కల్వర్టులకు నిధులు మంజూరు కాలేదు. దీంతో ఆయా పనులు అటకెక్కాయి. రెండేళ్ల కిందట పనులను పునఃప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పెండింగ్ పనులు నల్గొండ జిల్లా పరిధిలో ఉండటంతో అక్కడి ఆర్‌అండ్‌బీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. గతంలో అంచనా వ్యయంతో పోల్చితే ప్రస్తుతం పెరిగిన ధరల కారణంగా నిర్మాణం చేపట్టలేమని గుత్తేదారు చేతులెత్తేశారు. సంబంధిత అధికారులు సమస్య పరిష్కారానికి చొరవ చూపకపోవడంతో దెబ్బతిన్న రహదారిపై రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

సమస్యను ప్రభుత్వానికి నివేదించాం

యాకూబ్, ఈఈ, ఆర్‌అండ్‌బీ, నల్గొండ

భీమారం గ్రామం లోపలికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఇళ్లు, ప్రహరీలు ఉన్నాయి. దీంతో ఈ గ్రామం వద్ద బైపాస్ నిర్మించాలని నిర్ణయించాం. ఇందుకు భూసేకరణ ప్రక్రియ పూర్తి కాలేదు. ఈ సమస్యను ప్రభుత్వానికి నివేదించాం. తదుపరి ఆదేశాల మేరకు పనులు చేపడతాం.

# కళ్లుండీ చూడరు..!

నల్గొండ : దేవరకొండ డివిజన్‌లోని రెండు క్వారీల్లో అనుమతులిచ్చిన వాటి కంటే ఎక్కువ విస్తీర్ణంలో మైనింగ్ చేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. క్వారీ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా రూ.కోట్ల విలువైన సంపదను కొల్లగొడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సూర్యాపేట – ఖమ్మం రహదారిలో ఉన్న ఓ క్రషర్ మిల్లులో యథేచ్ఛగా అక్రమాలు జరుగున్నాయన్న ఆరోపణలున్నాయి. ఒక చోట తవ్వకాలకు అనుమతులు తీసుకొని మరోచోట తవ్వకాలు చేస్తున్నారని స్థానిక యంత్రాంగం గుర్తించినా.. చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలిసింది. ఉమ్మడి జిల్లాలోని పదుల సంఖ్యలోని క్వారీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు ఒక చోట తీసుకొని, మరో చోట తవ్వకాలు, కొన్నింటికి అనుమతులు ముగిసినా రెన్యూవల్ చేసుకోకుండా తవ్వకాలు జరుగుతున్నారు. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ( టీఎస్‌పీసీబీ) మార్గదర్శకాలను పాటించకుండా ఇష్టారాజ్యంగా వాతావరణంలోకి దుమ్ము, ధూళి కణాలను వెదజల్లుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

చిట్యాల, చౌటుప్పల్, బీబీనగర్, భువనగిరి, బొమ్మలరామారం, తుర్కపల్లి, మోతే, సూర్యాపేట, కోదాడ, నడిగూడెం, హుజూర్‌నగర్,



మేళ్లచెర్వు, మఠంపల్లితో పాటూ కృష్ణపట్టి ప్రాంతంలోని దేవరకొండ, కొండమల్లేపల్లి, హాలియా, పీఏ పల్లి ప్రాంతాల్లోని గ్రానైట్, మెటల్ క్వారీల్లో అధిక మోతాదులో పేలుళ్లకు పాల్పడుతున్నారు. గనులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర ప్రాజెక్టులకు మైనింగ్ చేయడానికి 5 హెక్టార్లకు మించితే తప్పకుండా స్థానిక ప్రజల అభిప్రాయ సేకరణ చేయించాలి. అవేవీ లేకుండానే పీసీబీ, రెవెన్యూ, మైనింగ్ అధికారులు 'సమన్వయం'తో పనిచేస్తూ గుత్తేదారులకు మేలు చేస్తున్నారన్న అభిప్రాయం ఉంది.

మైనింగ్ అక్రమాలపై కఠినంగా వ్యవహరించాలని ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి పక్కనున్న గుట్టలతో పాటూ దేవరకొండ, హుజూర్‌నగర్, కోదాడ, చౌటుప్పల్, సూర్యాపేట రెవెన్యూ డివిజన్‌లో అక్రమాల తంతు ఎక్కువగా జరుగుతున్నట్లు ఇటీవలే నిఘా అధికారులు ప్రభుత్వానికి ఇటీవలే సమగ్ర నివేదిక సమర్పించినట్లు తెలిసింది.

గుట్ట నుంచి కంకర, క్వార్జ్, గ్రానైట్ తీయాలంటే రెవెన్యూ శాఖ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ), భూగర్భ గనుల (మైనింగ్) శాఖ నుంచి లీజు పత్రంతో పాటూ పీసీబీ నుంచి కన్సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్(సీఎఫ్‌ఈ), కన్సెంట్ ఫర్ ఆపరేషన్ (సీఎఫ్‌వో) అనుమతులు తీసుకోవాలి. కానీ క్షేత్రస్థాయిలో ఇవేవి లేకుండా ఇష్టారీతిగా మైనింగ్ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 50కు పైగా స్టోన్ క్రషర్‌లు ఉన్నాయి. ప్రస్తుతం 15 నుంచి 20 క్రషర్లకు కాలపరిమితి ముగిసినా తవ్వకాలు మాత్రం ఆపడం లేదని సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది.

ఈసీ కమిటీ లేనందునే..: వెంకటేశ్వర్లు, ఏడీ, మైనింగ్, నల్గొండ జిల్లాపర్యావరణ క్లియరెన్స్ (ఈసీ) కమిటీ లేనందున కొన్ని స్టోన్‌క్రషర్‌ల రెన్యూవల్ ప్రక్రియ నిలిచిపోయింది. ఈసీ కమిటీ రాగానే లీజుల రెన్యూవల్ ప్రక్రియ పూర్తవుతుంది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి కఠిన చర్యలు తీసుకుంటాం.

# దగ్గు మందు దందా

కోదాడ : ఆ టానిక్‌ను దగ్గు తీవ్రంగా ఉన్న రోగులకు తప్పని పరిస్థితుల్లో వైద్యులు రాస్తుంటారు. అనారోగ్యం చివరి దశలో వాడాల్సిన మందును కొందరు అక్రమార్కులు యువతను తాగేలా ప్రోత్సహిస్తున్నారు. ఇది మెదడు మీద పని చేసి మనిషిని నిత్యం మత్తులో ఉంచుతుంది. ఇదే అదనుగా భావించి అరుదుగా దొరికే ఈ మందును విచ్చలవిడిగా యువతకు అలవాటు చేసి కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. దగ్గు మందు అనగానే చిన్నారులు, వృద్ధులు తరచుగా దగ్గు తగ్గడానికి వాడే మందు అనుకుంటాం. కానీ ఈ మందు అది కాదు. ఆల్కహాల్ తాగితే ఎంత కిక్కు వస్తుందో అంతకుమించి కిక్కు ఇచ్చే టానిక్ ఇది. దగ్గు మందు అని చెబుతూ కొందరు అక్రమార్కులు చదువుకునే యువతను ముగ్గులోకి దించి, వారి జీవితాలను మత్తులోకి లాగి దీంతో వాప్యారం చేస్తున్నారు. ప్రమాదకరమైన గంజాయికి ఏ మాత్రం తీసిపోని మత్తు పదార్థం ఇది. ఈ ఉదంతం కోదాడ ఎక్సైజ్ శాఖ సిబ్బంది నిర్వహించిన తనిఖీల్లో బయటపడగా, వారు జిల్లా డ్రగ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. తాజాగా ఏక కాలంలో ఎక్సైజ్ శాఖ, డ్రగ్ అధికారులు నిర్వహించిన సోదాలో స్థానికులు విస్తుపోయే దగ్గు మందు దందా బయటపడింది.

యువత, కూలీలే లక్ష్యం... కొందరు ఒక బృందంగా ఏర్పడి కళాశాల యువతకు, సిమెంట్ ఫ్యాక్టరీల్లో, రైస్ మిల్లుల్లచి పని చేసే కూలీలకు కొందరు విక్రయిస్తున్నారు. కోదాడ నియోజకవర్గంలోని కళాశాల యువతకు, హుజూర్‌నగర్‌లోని సిమెంట్ ఫ్యాక్టరీల్లో, మిర్యాలగూడ రైస్ మిల్లుల్లచి పని చేసే కూలీలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. మొదట్లో ఒకరికి అలవాటు



చేసి వారి ద్వారా మిగతా వారికి ఈ మందును పరిచయం చేస్తున్నట్లు సమాచారం. ఈ మందును రహస్య ప్రదేశాల్లో డంప్ చేస్తున్నారు. దీన్ని విక్రయించేటప్పుడు ఎలాంటి బిల్లులు ఉండవు. బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్నారు. 100 ఎంఎల్ ఉన్న సీసా ధర మార్కెట్లో రూ.100 నుంచి రూ.150 మధ్యలో దొరుకుతుంది. ఈ మందు కొరత చూపించి ఒక్కో సీసా రూ.500లకు విక్రయిస్తున్నారు. తాజాగా మఠంపల్లి మండల కేంద్రంలో ఓ వ్యక్తి వీటిని విక్రయిస్తూ పట్టుబడిన సంగతి తెలిసిందే. ఆ నిందితుడు ఏడాది కాలంలో సుమారు 5 వేల సీసాలు అమ్మినట్లు సమాచారం. అతనొక్కడే సుమారు రూ.25 లక్షల వ్యాపారం చేశాడంటే ఈ దందా ఏ స్థాయిలో జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం: సురేందర్, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సూర్యాపేట

దగ్గు మందు దందాలో భాగస్వాములైన ప్రతి ఒక్కరిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. సదరు దుకాణాలను సీజ్ చేస్తాం. ఈ మందు తాగిన వ్యక్తులు పిచ్చోడిలా ప్రవర్తిస్తుంటారు. ముఖ్యంగా కళాశాలలకు వెళ్తున్న యువత తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

# గడువు ముందర.. పనులకేదీ తొందర



సిరిసిల్ల: గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధుల కొరత వెంటాడుతోంది. చేసిన పనులకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా జిల్లాలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఉపాధి హామీ పథకంలో 2023–24 ఏడాదికి గాను సీసీ రహదారులు, పంచాయతీ భవనాలు, మన ఊరు– మన బడి పనులకు పలు విడతల్లో రూ.499 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో రూ.185 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. పనులు పూర్తయిన వాటిలో సిరిసిల్ల నియోజకవర్గంలోనివే ఎక్కువగా ఉన్నాయి. వేములవాడ నియోజకవర్గం, బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో చాలా వరకు ప్రారంభమే కాలేదు. గతేడాది ఫిబ్రవరిలో పనులు ప్రారంభించి ఈ ఏడాది మార్చిలోగా పూర్తి చేయాల్సి ఉంది. జిల్లాలో చాలా చోట్ల పనుల్లో ఆశించిన పురోగతి లేక అసంపూర్తిగానే ఉన్నాయి. మరో 24 రోజుల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఇప్పటికీ ప్రారంభం కానీ పనులను పురోగతిలో చూపితే నిధులు వెనక్కి వెళ్లకుండా ఉండే అవకాశాలున్నాయి.

అసంపూర్తిగా పంచాయతీ భవనాలు

జిల్లాలో చాలా చోట్ల పంచాయతీల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొత్తగా ఏర్పడిన వాటికి సొంత భవనాలు లేవు. చాలా వరకు పాఠశాల గదులు, అద్దె భవనాల్లో కాలం వెళ్లదీస్తున్నారు. విలువైన దస్త్రాలకు భద్రత కరవైంది. జిల్లాలో 153 పంచాయతీ భవనాలకు రూ. 27.94 కోట్లు మంజూరయ్యాయి వాటిలో 44 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. 79 భవనాలు అసంపూర్తి దశలో ఉన్నాయి. 30 చోట్ల పనులు ప్రారంభానికి నోచుకోలేదు.

ప్రారంభించని సీసీ రోడ్లు

అంతర్గత రహదారులు లేని గ్రామాలు, కాలనీల్లో వర్షాకాలంలో బురద కష్టాలు తప్పవు. వీధుల్లో సిమెంటు రహదారులు, మురుగు కాల్వల నిర్మాణాలకు జిల్లాలో 2,260 పనులకు గాను రూ.124 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో 1,852 పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 408 పనులు అసంపూర్తి దశలో, ప్రారంభానికి నోచుకోక ఉన్నాయి. మన ఊరు– మన బడి పనుల పరిస్థితి అలాగే ఉంది. వంట గదులు, మూత్రశాలలు, ప్రహరీల నిర్మాణానికి రెండు విడతల్లో 284 పనులకు గాను రూ. 13.20 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో ఇప్పటికీ కేవలం రూ.4.30 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు.

జాప్యానికి కారణాలు ఇవీ...

జిల్లాలో ఉపాధి హామీలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన పనుల్లో 40 శాతం నిధులు అదనంగా వినియోగించారు. సాఫ్ట్‌వేర్ మారడం, కేంద్రం నుంచి పర్యవేక్షణ జరుగుతుండటంతో నిధుల విడుదలలో జాప్యం జరిగింది. పనులు మంజూరు చేయడం, వాటిని గుత్తేదారులకు అప్పగించడం, ఒప్పందం చేసుకోవడంలో నెలల తరబడి జాప్యం నెలకొంటుంది. ఏటా జనవరి, ఫిబ్రవరిలోనే గడువు సమీపిస్తుందని పనులు పూర్తి చేసేందుకు హడావుడి చేస్తుంటారు. దీంతో అన్ని చోట్ల ఒకేసారి పనులు ప్రారంభం కావడంతో మెటీరియల్, కూలీల కొరత ఏర్పడుతుంది. దీనికి తోడు ఇంజినీరింగ్ విభాగంలో సిబ్బంది కొరతతో పర్యవేక్షణ కొరవడుతుంది. ఎం.బి.రికార్డుల నమోదులో జాప్యం జరిగి, బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యమవుతోంది.

ఎల్లారెడ్డిపేట మండలం అక్కపెల్లిలో సీసీ రహదారుల నిర్మాణానికి రెండు విడతల్లో రూ.40 లక్షలు మంజూరయ్యాయి. అలాగే అల్మాస్‌పూర్‌లోనూ రూ.25 లక్షలు మంజూరయ్యాయి. ఈ రెండు గ్రామాల్లోనూ పనులు చేసేందుకు గుత్తేదారు ముందుకు రాకపోవడంతో ప్రారంభం కాలేదు. దీంతో ఈ ఏడాది కూడా వర్షాకాలంలో బురద దారులతో కష్టాలు తప్పేలాలేవు. వీర్నపల్లి మండలం కంచర్ల పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. గ్రామంలో భవన నిర్మాణానికి స్థలం కూడా సేకరించారు. పనులు చేసేందుకు గుత్తేదారు ముందుకు రాకపోవడంతో ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు.

గడువులోగా పూర్తి చేయిస్తాం

అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనాలు, సీసీ రహదారుల నిర్మాణాలను గడువులోగా పూర్తి చేయిస్తాం. ఒప్పందం చేసుకుని ప్రారంభించిన పనులు గడువు దాటినా పురోగతిలో ఉన్నట్లే. చాలా వరకు పనులు ప్రారంభించాం. పనులు జరిగిన స్థాయిని బట్టి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా కొంత ఆలస్యమవుతుంది. సూర్యప్రకాశ్, ఈఈ

# ఎస్సారెస్పీ కాలువల పునరుద్ధరణ పనుల్లో అక్రమాలు



వరంగల్ : ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఎస్సారెస్పీ ప్రధాన కాలువతో పాటు పంట కాలువల పునరుద్ధరణ పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయి. పనులు పూర్తికాకుండానే బిల్లులు మంజూరు చేసినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. కొన్ని చోట్ల సగం పనులే జరిగాయి. పలు ప్రాంతాల్లో ప్రారంభించని పనులకు సైతం బిల్లులు చెల్లించారు. ఈ అక్రమాలపై ఆయకట్టు రైతు సంఘాల నేతలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీంతో సమగ్ర విచారణకు నీటిపారుదల మంత్రిత్వ శాఖ చర్యలు చేపట్టింది.

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని చాలా ప్రాంతాల్లో ప్రధాన, పంట కాలువలు దెబ్బతిన్నాయి. 40 ఏళ్ల క్రితం నిర్మించిన కాలువ పలు ప్రాంతాల్లో ధ్వంసమై నీరు వృథాగా పోతుండడంతో నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. స్పందించిన గత భారాస ప్రభుత్వం ఎస్సారెస్పీ స్టేజ్–1, 2 పరిధిలోని ప్రధాన కాలువతోపాటు అన్ని ప్రాంతాల్లోని పంటల కాలువల మరమ్మతులకు 2023 జనవరిలో రూ.293.35 కోట్లు విడుదల చేసింది. టెండర్ల అనంతరం పనులు ఆలస్యంగా ప్రారంభించడంతో జులై వరకు 60 నుంచి 70 శాతం పనులే జరిగాయి. కొన్ని ప్రాంతాల్లో 50 శాతం లోపే పనులు చేసినట్లు తెలిసింది. జులై రెండో వారంలో వర్షాలు కురువడంతో పనులు నిలిపివేశారు.

అక్రమాలు ఇలా...ఎస్సారెస్పీ మొదటి దశ వరంగల్ సర్కిల్ పరిధిలోని పనులకు రూ.163.00 కోట్లు కేటాయించారు. కాకతీయ ప్రధాన కాలువ 191 కిలోమీటరు నుంచి 232 కిలోమీటర్ల వరకు మరమ్మతులు, లైనింగ్ కోసం రూ.119.88 కోట్లు విడుదల చేయగా.. ఈ పనులన్నీ తూతూ మంత్రంగా సాగాయి. వరంగల, హనుమకొండ పలివేల్పుల, గుండ్లసింగారం, ఎల్కతుర్తి, ఎల్లాపూర్ ప్రాంతాలో ప్రధాన కాలువకు మరమ్మతులు చేయగా.. వీటిలో సగానికిపైగా కొట్టుకు పోయాయి. పనులు చేస్తున్న క్రమంలోనే జులైలో ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయడంతో లైనింగ్ పనులు ఆగిపోయి, కంకర తేలింది. ఇవేవీ పట్టించుకోకుండా ప్రధాన కాలువ పనులు చేసిన గుత్తేదారుకు బిల్లులు చెల్లించినట్లు సమాచారం. అప్పటి శాసనసభ్యులు తమ పరిధిలోని పనులకు నీటిపారుదల శాఖ అధికారిపై ఒత్తిడి తేవడంతో చేయని పనులకు సైతం పూర్తిగా బిల్లులు చెల్లించినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఆ నిధులను అధికారులు, గుత్తేదారులు వాటాలు పంచుకు తిన్నట్లు ఆరోపణలు వచ్చాయి.

డిస్ట్రిబ్యూటర్స్ డీబీఎం 18,20,21,22, 22 ఏ, బి, 23, కాలువ మరమ్మతులకు రూ.3.25 కోట్లు కేటాయించారు. ఈ పనులను పర్యవేక్షించిన ఇంజినీర్లే లేరని రైతులు అంటున్నారు. కాలువలకు కేవలం సిమెంట్ పైపూత పూసినిధులను కాజేసినట్లు ఫిర్యాదు అందాయి.

డీబీఎం 23ఏ, 23బి, 23సి, డీబీఎం 24, 26, 27, 28, 29 కాలువలతోపాటు డీబీఎం 31 పరిధిలోని 17 కిలోమీటరు నుంచి 42 కిలోమీటరు వరకు గల ఉప కాలువల లైనింగ్ నిర్మాణం, కట్టల మరమ్మతులకు రూ.6.09 కోట్లు కేటాయించగా.. కేవలం 50 శాతం పనులే చేశారు. బిల్లులు మాత్రం 80 శాతం వరకు చెల్లించారు.

ఎస్సారెస్పీ ప్రధాన కాలువ 233 కిలోమీటరు నుంచి 267 కిలోమీటరు వరకు రీమోడలింగ్, పూర్తిగా లైనింగ్ నిర్మాణం, డీబీఎం 46 కాలువ మరమ్మతు పనులకు రూ.14.32 కోట్లు విడుదల చేశారు. ఈ పనులు పూర్తిగా నాసిరకం ఇసుక, సిమెంట్, మిక్సర్‌తో తెచ్చి తూతూ మంత్రంగా చేసినట్లు ఫిర్యాదులు అందాయి. వరంగల్ నగర సమీపంలోని ఆటోనగర్ నుంచి దేశాయిపేట వరకు ప్రధాన కాలువ 229 నుంచి 230 కిలోమీటర్ల వరకు యూటీలు, ఫీడర్ చానల్స్, షెట్టర్ల నిర్మాణం, కాలువ రీమోడలింగ్‌కు ప్రత్యేకంగా రూ.14.30 కోట్లు కేటాయించారు. ఈ పనులకు 15 శాతం అదనంగా బిల్లులు మంజూరు చేసినట్లు ఆరోపణలున్నాయి.

డీబీఎం 18,20,22, 23 పంటకాలువల మరమ్మతులకు రూ.61 లక్షలు, డీబీఎం 31 పరిధిలోని 17 నుంచి 42 టీసీ వరకు మైనర్ రిపేర్లకు రూ.1.42 కోట్లు విడుదల చేశారు. మైనర్ రిపేర్లంటే పర్యవేక్షణ చేసి వదిలేశారు. గండ్లు, బుంగలు పడినచోట అక్కడక్కడ మొరం పోసి పనులు పూర్తి చేసినట్లు రికార్డులు రాశారు.

రెండో దశకు ఇలా....

నీటి పారుదలశాఖ మహబూబాబాద్ సర్కిల్ పరిధిలోని ఎస్సారెస్పీ పనులకు రూ.130.35 కోట్లు కేటాయించారు. రెండో దశ 83 కిలో మీటర్ల వరకు ప్రధాన కాలువ సీసీ నిర్మాణాలు, లైనింగ్, ఇతర మరమ్మతులు, 267 నుంచి 284 కిలోమీటర్ల వరకు కాలువ మరమ్మతులకు, డీబీఎం50, 51, 51ఏ, 53 కాలువల మరమ్మతులకు రూ.125.88 కోట్లు కేటాయించారు. ఈ పనులు 60 శాతమే పూర్తిచేసినా బిల్లులు మాత్రం 80 శాతం వరకు చెల్లించినట్లు ఆయకట్టు రైతు సంఘాల నేతలు ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. డీబీఎం 48 పరిధిలోని 23 నుంచి 83 కిలోమీటర్ల వరకు గల పంటకాలువ మరమ్మతులకు రూ.4.47 కోట్లు విడుదల చేశారు. పనులు మొదలు పెట్టిన కొద్ది రోజులకే వర్షాలతోపాటు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేశారు. దీంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. బిల్లుల మాత్రం చేసిన పనికన్నా ఎక్కువ మొత్తంలో చెల్లించినట్లు సమాచారం.

# వడ్డీ వస్తోంది.. రామక్కా..!

సూర్యాపేట: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు అందిస్తున్నారు. తీసుకున్న రుణాలను వాయిదాల ప్రకారం చెల్లిస్తే ప్రభుత్వం వడ్డీ తిరిగి చెల్లిస్తుంది. వడ్డీ లేని రుణం అందించాలనేది ఈ పథకం లక్ష్యం. కొన్నేళ్లుగా వడ్డీ చెల్లింపులు ఆగిపోవడంతో మహిళలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. బకాయిలు విడుదల చేయాలని తాజాగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. నాలుగేళ్లలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో రూ.485.14 కోట్ల వడ్డీ బకాయిలు రావాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో...ఉమ్మడి నల్గొండ జిల్లాలో 72,678 మహిళా స్వయం సహాయక సంఘాల్లో 6,33,206 మంది సభ్యులు ఉన్నారు. మహిళలు వ్యాపారం, వ్యవసాయ పరంగా రాణించాలన్న ఉద్దేశంతో ఏటా సెర్ప్ ఆధ్వర్యంలో రూ.వందల కోట్లు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు ఇప్పిస్తున్నారు. తీసుకున్న మొత్తానికి వాయిదాలు చెల్లిస్తేనే వడ్డీ తిరిగి అందిస్తారు. రెండేళ్ల కిందట బకాయిలు విడుదల చేస్తున్నట్లు భారాస ప్రభుత్వం ప్రకటించినా అమలు చేయలేదు. తాజాగా దీనిపై సమీక్షించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు చెల్లించాలని నిర్ణయం తీసుకోవడంతో ఎస్‌హెచ్‌జీ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్షేత్రస్థాయిలో సమాచారం సేకరిస్తున్నాం...: మధుసూదన రాజు, గ్రామీణాభివృద్ధి అధికారి, సూర్యాపేట

ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వయం సహాయక సంఘాలకు పెండింగ్ వడ్డీ బకాయిలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. క్షేత్ర స్థాయిలో ఐకేపీ అధికారులు సమావేశాలు నిర్వహించి వివరాలు సేకరిస్తున్నారు. పొందిన లింకేజీ రుణం, చెల్లింపులు, ఇతరాత్ర క్షుణ్ణంగా పరిశీలించి సమగ్ర సమాచారం ప్రభుత్వానికి అందిస్తాం.

# చెరకు రైతులపై రవాణా భారం

జహీరాబాద్ : జహీరాబాద్ ప్రాంతంలోని అత్యధిక మంది రైతులు దశాబ్దాలుగా చెరకు పంటను నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక విస్తీర్ణంలో ఇక్కడ చెరకు సాగు చేస్తున్నారు. కొత్తూరు సమీపంలోని ట్రైడెంట్ పరిశ్రమ యాజమాన్యం నిర్వాకం వల్ల నాలుగేళ్లుగా రైతులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడమే కారణం. దీనికి తోడు ఈ సీజన్‌లో ట్రైడెంట్ యాజమాన్యం చెరకు గానుగ(క్రషింగ్) నిర్వహించలేదు. ఇతర ప్రాంతాల్లోని పరిశ్రమలకు ఇక్కడి చెరకును తరలించిన రైతులపై రవాణాభారం పడింది.

టన్నుకు రూ.300 అదనం

2023–24 వ్యవసాయ సీజన్‌లో అధికారిక గణాంకాల ప్రకారం జహీరాబాద్ సమీపంలోని ట్రైడెంట్ పరిశ్రమ పరిధిలో దాదాపు 21వేల ఎకరాల్లో చెరకు పంట వేశారు. ఎకరానికి సగటున 36 టన్నుల లెక్కన మొత్తం ఏడు లక్షల పైచిలుకు టన్నుల చెరకు ఉత్పత్తి అయింది. స్థానిక ట్రైడెంట్ కర్మాగారంలో గానుగ నిర్వహించక పోవడంతో రైతులంతా ప్రత్యామ్నాయాన్ని అన్వేషించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సంగారెడ్డి సమీపంలోని గణపతి చక్కెర మిల్లుకు 1.50 లక్షల టన్నులు, కామారెడ్డి జిల్లాలోని మాగి పరిశ్రమకు 60వేల టన్నులు, వనపర్తి జిల్లా కొత్తకోట పరిశ్రమకు లక్ష టన్నుల చెరకును రైతులు గానుకోసం తీసుకెళ్లారు. మిగిలిన చెరకును మహారాష్ట్ర, కర్ణాటకలోని వివిధ పరిశ్రమలకు తరలించారు. దీంతో ఒక్కో టన్నుపై కనీసం రూ.300 నుంచి రూ.400 వరకు రవాణా ఛార్జీలు అదనంగా పడ్డాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ లెక్కన రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు రవాణా ఛార్జీల భారం రైతులు భరించాల్సి వచ్చింది. ట్రైడెంట్ కర్మాగారంలో రెండేళ్ల క్రితం కూడా ఇలాగే గానుగ ఆడించకపోవడంతో రైతులు ముప్పుతిప్పలు పడాల్సి వచ్చింది. ఓ వైపు ప్రభుత్వం.., మరో వైపు కర్మాగారం యాజమాన్యం నిర్లక్ష్య వైఖరికి రైతులు నష్టపోతున్నారని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

వచ్చే సీజన్‌పై అయోమయం

జహీరాబాద్ సమీపంలోని ట్రైడెంట్ పరిశ్రమలో ఈ ఏడాది గానుగ చేపట్టలేదు. వచ్చే సీజన్‌కు సంబంధించిన గానుగపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. అధికారులు చొరవ తీసుకుని వచ్చే సీజన్‌లోనైనా క్రషింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బిల్లుల చెల్లింపులో సతాయింపు

గత నాలుగు సీజన్లుగా జహీరాబాద్ ప్రాంతంలోని చెరకు రైతులకు సకాలంలో బిల్లులు అందడం లేదు. ఓ సీజన్‌లో తరలించిన చెరకు డబ్బులను మరో సీజన్‌లో చెల్లించేవారు. కొన్నిసార్లు ఇంకా ఎక్కువ జాప్యం జరిగేది. బిల్లుల కోసం రైతులు కర్మాగారం ఎదుట అనేక పర్యాయాలు ధర్నాలు, ఆందోళనలు చేస్తేనే.. డబ్బులు చేతికి అందే పరిస్థితి ఉండేది. అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు పలుమార్లు సమీక్షలు నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది. గత చెరకు సీజన్‌కు సంబంధించిన బకాయి బిల్లులను ఇంకా పూర్తి స్థాయిలో చెల్లించలేదు. అన్నదాతలు పంటల కోసం చేసిన అప్పులు తీర్చలేక ఇబ్బంది పడుతున్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం

– రాజశేఖర్, చక్కెరశాఖ జిల్లా సహాయ కమిషనర్

ట్రైడెంట్ చక్కెర కర్మాగారంలో పరిస్థితులపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేసి రైతులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశాం. యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి, సమీక్షలు నిర్వహించాం. బకాయి బిల్లులు ఇప్పించాం. ట్రైడెంట్‌లో గానుగ సాగకపోవడంతో ఈ ప్రాంతంలోని చెరకును ఇతర కర్మాగారాలకు తరలించేందుకు తగిన ఏర్పాట్లు చేశాం.

# అందని బిల్లులు.. అవస్థల్లో పాడి రైతులు

మెదక్ : పాలు, వాటి నుంచి తయారయ్యే పదార్థాల వాడకం చాలా శ్రేష్ఠమని వైద్యులు సూచిస్తారు. మనిషి రోజుకు 200–400 మీ.లీటర్ల పాలు తాగితే శారీరకంగా దృఢంగా ఉంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాల ఉత్పత్తిని పెంచేందుకు పలు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తున్నా.. అవి ప్రకటనలకే పరిమితం కావడంతో రోజు రోజుకు పాల దిగుబడి తగ్గుతోంది. ప్రభుత్వ డెయిరీలో పాలు పోసే పాడి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి 15 రోజులకు ఒకసారి బిల్లును ఇస్తున్నారు. అక్టోబరు నెల వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతుల బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేశారు. కానీ గత కొన్ని నెలల నుంచి రావాల్సిన బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో జిల్లాలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

దీనిపై విడుదల కాని డబ్బులు

ప్రధానంగా పాలు పోసె రైతులు వ్యవసాయం, పాడి పశువులపై ఆధారపడి జీవనం సాగిస్తారు. గత రెండు బిల్లుల డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. దీంతో డ్వాక్రా గ్రూప్‌తో పాటు చిట్టి డబ్బులు, రోజు వారి ఖర్చులు చెల్లించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రైవేట్ డెయిరీలకు పాలు పోస్తే సకాలంలో డబ్బులు చెల్లించకుండా మోసం చేస్తారని రైతులు వాపోయారు. అందుకే తక్కువ ధర అయినప్పటికీ ప్రభుత్వ రంగ సంస్థలకు పోస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం కూడా బిల్లులు సకాలంలో చెల్లించకుండా జీవితాలతో చలగాటం ఆడుతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

తగ్గుతున్న పాలుపోసేవారి సంఖ్య

గత 5–6 నెలల నుంచి పాడి రైతులకు సంబంధించిన బిల్లులను సకాలంలో చెల్లించకపోవడంతో రోజు రోజుకు విజయ డెయిరీలో పాలు పోసే వారి సంఖ్య తగ్గుతోంది. గత సంవత్సరం డిసెంబరు నెలలో జిల్లా వ్యాప్తంగా 1600 మంది రైతుల నుంచి 7 వేల లీటర్లకు పైగా పాలు వస్తుండగా, ప్రస్తుతం 1100 మంది రైతుల నుంచి 3400 లీటర్ల పాలు మాత్రమే వస్తున్నాయి. ఇటీవల విజయ డెయిరీ సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో ప్రైవేట్ సంస్థలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించకపోతే రానున్న రోజుల్లో పరిస్థితి మరింత దారుణంగా మారే ప్రమాదం ఉంది.

జిల్లాలో డెయిరీల సంఖ్య: 01

బీఎంసీలు: 07 (చేగుంట, కౌడిపల్లి, రామాయంపేట, రేగోడ్, పెద్ద శంకరంపేట, యవాపూర్, పాపన్నపేట)పాల సహకార సంఘాలు: 60సేకరణ కేంద్రాలు: 93పాడి రైతులు: 1100రోజువారీగా పాల సేకరణ: 3–4 వేల లీటర్లురావాల్సి బకాయిలు: రూ.70 లక్షలుపంపిణీదారులు కావాలి గతంలోని నాలుగు బిల్లులకు సంబంధించిన బకాయిలు రూ.1.50–2 కోట్లు ఇటీవలే రైతుల ఖాతాలో జమ అయ్యాయి. ప్రస్తుతం ఫిబ్రవరి నెలకు సంబంధించిన రెండు బిల్లుల డబ్బులు రూ.70 లక్షల వరకు రావాల్సి ఉంది. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభించనుంది. జిల్లాకు సంబంధించిన పంపిణీదారులు లేకపోవడంతో ఇక్కడ సేకరించిన పాలను హైదరాబాద్‌కు సరఫరా చేసి విక్రయించాల్సి ఉంది.

# కావాలనే చిన్నపీట మీద కూర్చున్నా: డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్: యాదాద్రి ఆలయంలో తాను కావాలనే చిన్నపీట మీద కూర్చున్నానని, దాన్ని సామాజిక మాధ్యమాల్లో అర్థంపర్థం లేకుండా ట్రోల్ చేస్తున్నారని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బంజారాహిల్స్‌లో నిర్వహించిన సింగరేణి అతిథిగృహ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాదాద్రి ఘటనపై వివరణ ఇచ్చారు. "మా ప్రభుత్వం వచ్చాక మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో భాగంగా పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతం కావాలని కోరుకుంటూ యాదగిరిగుట్టలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశాం. దీనిలో భాగంగా కావాలనే చిన్నపీట మీద కూర్చున్నా. ఉపముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని శాసిస్తున్నా. మూడు శాఖలతో ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్నా. ఆత్మగౌరవంతో జీవించే మనిషిని. నన్ను ఎవరూ అవమానించలేదు. అందరూ దీన్ని అర్థం చేసుకోవాలని కోరుతున్నా. సింగరేణి సంస్థను మరింత అభివృద్ధి చేస్తాం. ఈ సంస్థ ఆదాయాన్ని కార్మికులకు, రాష్ట్ర ప్రజలకే చెందేలా చూస్తాం"అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని చాటేలా దేవాలయాల అభివృద్ధి



హైదరాబాద్ : తెలంగాణ ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని చాటేలా రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా మాటల్లో కాకుండ చేతల్లో చూపిస్తామన్నారు. వరంగల్‌లోని కాళోజీ కళాక్షేత్రం పనుల పురోగతి, భద్రకాళి దేవస్థానం అభివృద్ధి పనులపై మంగళవారం సచివాలయంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, అధికారులతో సమీక్షించారు. చారిత్రాత్మక భద్రకాళి దేవస్థానం అభివృద్ధి పనులను ఆగమశాస్త్ర ప్రకారం నిర్మాణాలను చేపట్టాలని, ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. 30 కోట్ల రూపాయలతో దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఇందులో 20 కోట్ల రూపాయలను %ాణఖీ% కింద, 10 కోట్ల రూపాయలను కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా) సమకూరుస్తుందని పేర్కొన్నారు. కాళోజీ నారాయణరావు కళాక్షేత్ర పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలని, అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరక్ దాన కిశోర్, దేవాదాయ శాఖ కమిషనర్ వి.అనిల్ కుమార్, హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయిక్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీళ్లే మిగిలాయి : జగదీష్‌రెడ్డి



సూర్యాపేట : కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీళ్లే మిగిలాయి. రాష్ట్రంలో కరువు పరిస్థితులపై సమీక్ష చేసే సోయి ముఖ్యమంత్రి, మంత్రులకు లేకపోయిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులపై ఫైర్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతాంగాన్ని గాలి వదిలేసి.. వ్యాపారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఢిల్లీకి డబ్బు మూటలు పంపుతున్నారని ఆరోపించారు. తక్షణమే రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి.. ఆయా జిల్లాల్లో మంత్రులు కరువు మీద సమీక్ష చేయాలని డిమాండ్ చేశారు. కర్ణాటక సీఎంతో ముఖ్యమంత్రితో మాట్లాడి.. ఆల్మట్టి నుంచి పది టీఎంసీలు నీరు విడుదల చేయించాలని సూచించారు. అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలో తీవ్ర ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు పోరాడుతామన్నారు.

# లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున కీలక నిర్ణయం?




న్యూఢిల్లీ: కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయకపోవచ్చని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ చీఫ్‌గా ఉండి ఎన్నికలకు దూరంగా ఉండకూడదనే సెంటిమెంట్ ఉన్నప్పటికీ.. పార్టీని ముందుండి నడిపించాలని ఆ పార్టీ ముఖ్యులు ఖర్గేకు సలహా ఇచ్చినట్టుగా తెలుస్తోంది. సొంత నియోజకవర్గంలో తన గెలుపుపై దృష్టి పెట్టకుండా దేశవ్యాప్తంగా ఎన్నికలపై ఫోకస్ చేయాలని సలహా ఇచ్చినట్టుగా సమాచారం.

కర్ణాటకలోని గుల్బర్గా నియోజకవర్గం నుంచి మల్లికార్జున ఖర్గేని పోటీకి దింపుతూ ఇటీవలే కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవ నిర్ణయం తీసుకుంది. అయినప్పటికీ ఖర్గే స్థానంలో ఆయన అల్లుడు రాధాకృష్ణన్ దొడ్డమణిని బరిలోకి దించే అవకాశాలున్నాయని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. కాగా మల్లికార్జున ఖర్గే 'గుల్బర్గా నియోజకవర్గం' నుంచి రెండు పర్యాయాలు ఎంపీగా గెలిచారు. అయితే 2019లో ఆయన ఓటమిని చవిచూశారు. అయితే ఆ తర్వాత రాజ్యసభకు నామినేట్ అయ్యారు. రాజ్యసభలో ప్రస్తుతం ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఉన్నారు.

మరో నాలుగేళ్ల పదవికాలం కూడా మిగిలివుంది. దీంతో అల్లుడిని ప్రత్యక్ష ఎన్నికల్లో నిలిపే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా ఖర్గే కొడుకు ప్రియాంక్ ఖర్గే ప్రస్తుతం కర్ణాటక మంత్రిగా ఉన్నారు. అయితే లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి ఆయన అనాసక్తిగా ఉన్నారని తెలుస్తోంది. దీంతో రాష్ట్ర మంత్రిలోని వ్యక్తులను లోక్‌సభ ఎన్నికల బరిలో నిలపాలనే యోచనను పార్టీ పక్కన పెట్టింది.

కాగా కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రముఖ నేతలు ఎవరూ లోక్‌సభ బరిలో నిలవడం లేదు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

# పదో తరగతి పరీక్షలపై రేవంత్ సీరియస్.. జామర్లతో సిగ్నల్స్ ఆఫ్ చేయిస్తారట..



హైదరాబాద్: పదో తరగతి పరీక్షల నిర్వహణ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి చాలా సీరియస్‌గా ఉన్నారు. ఈ క్రమంలోనే ఈ సారి కఠిన ఆంక్షలతో పదో తరగతి పరీక్షలను నిర్వహించనున్నారు. ఎగ్జామినేషన్ సెంటర్స్ దగ్గర నో సెల్ ఫోన్ జోన్స్‌ను ఏర్పాటు చేశారు. పరీక్ష జరిగేంత వరకూ అవసరమైతే జామర్లతో సిగ్నల్స్ ఆఫ్ చేయించే యోచనలో అధికారులు ఉన్నారు.

విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, స్క్వాడ్, సిబ్బందికి ఫోన్లను అందుబాటులో లేకుండా చూడనున్నారు. రూల్స్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష కేంద్రం నుంచి ప్రశ్న పత్రాలు బయటికి వెళ్లకుండా, మాస్ కాపీయింగ్ జరుగకుండా కట్టుదిట్టంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గత ఏడాది జరిగిన ఘటనల నేపథ్యంలో ఈ సారి పక్కాగా పరీక్షలు నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 18 నుంచి ఎప్రిల్ 2 వరకు పదోతరగతి పరీక్షలు జరగనున్నాయి. 5.80 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ ఆదేశాలు జారీ చేశారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు.




దక్షిణ మధ్య రైల్వే సారథ్యంలో మరో రెండు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు పట్టాలెక్కాయి. సికింద్రాబాద్-విశాఖ మధ్య ఇప్పటికే ఈ రైలు నడుస్తుండగా.. నేటి నుంచి మరొకటి అందుబాటులోకి వచ్చింది. దీంతో పాటు ద.మ. రైల్వే పరిధిలోని కొన్ని స్టేషన్లను కలుపుతూ కలబురగి-బెంగళూరు మార్గంలో కొత్త ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం పచ్చజెండా ఊపారు. వీటితో పాటు మొత్తం 10 వందేభారత్‌లను ప్రధాని నేడు వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతో దేశంలో మొత్తం ఈ రైళ్ల సంఖ్య 50 దాటడం విశేషం. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.85వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు/ప్రారంభోత్సవాలు చేశారు. వీటిలో కొన్నింటిని జాతికి అంకితం చేశారు. దక్షిణమధ్య రైల్వే పరిధిలో 9 పీఎం గతిశక్తి కార్గో టెర్మినళ్లు, 11 గూడ్స్ షెడ్లు, రెండు జన ఔషధి కేంద్రాలు, 3 రైల్వే కోచ్ రెస్టారంట్లను ప్రధాని నేడు ప్రారంభించి జాతికి అంకితం చేశారు. కొల్లం-తిరుపతి మెయిల్ ఎక్స్‌ప్రెస్, పలు మార్గాల్లో రెండో లైను, మూడో లైను, గేజు మార్పిడి, బైపాస్ లైన్లను ప్రారంభించారు. **51కి చేరిన వందేభారత్‌లు..** సికింద్రాబాద్-విశాఖ, కలబురగి-బెంగళూరుతో పాటు లఖ్‌నవూ-దేహ్రాదూన్, పట్నా-లఖ్‌నవూ, న్యూ జల్‌పాయ్‌గుడి-పట్నా, పూరి-విశాఖపట్నం, రాంచీ-వారణాసి, ఖజురహో-దిల్లీ, అహ్మదాబాద్-ముంబయి, మైసూరు-చెన్నై మార్గాల్లో మొత్తం 10 రైళ్లను ప్రధాని నేడు ప్రారంభించారు. దీంతో దేశంలో మొత్తం వందేభారత్‌ల సంఖ్య 51కి చేరంది. ఇవి 45 మార్గాల్లో పరుగులు తీస్తున్నాయి. అత్యధికంగా దిల్లీ గమ్యస్థానానికి దేశంలోని పలు ప్రాంతాల నుంచి పది వందేభారత్‌లు అందుబాటులో ఉన్నాయి.

# తెలుగు రాష్ట్రాల పట్ల మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది : కిషన్‌రెడ్డి






హైదరాబాద్: గత పదేళ్లలో దేశంలో రైల్వే గణనీయమైన అభివృద్ధి సాధించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తెలుగు రాష్ట్రాల పట్ల మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లను ప్రవేశపెట్టారని కొనియాడారు.

అహ్మదాబాద్ నుంచి ప్రధాని నరేంద్ర మోదీ సికింద్రాబాద్ - విశాఖ మార్గంలో రెండో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను వర్చువల్‌గా జెండా ఊపి ప్రారంభించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో కిషన్ రెడ్డి, వర్చువల్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఇప్పటికే మూడు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు నడుస్తున్నాయని.. ఇవాళ మరో ఎక్స్‌ప్రెస్‌ను మోదీ ప్రారంభించడం సంతోషకరమన్నారు.

చర్లపల్లి టెర్మినల్ పనులు 90 శాతం పూర్తయ్యాయని.. మరికొద్ది రోజుల్లోనే ప్రారంభిస్తామని చెప్పారు. దేశవ్యాప్తంగా మొత్తం 10 వందేభారత్‌లను ప్రధాని నేడు వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతో దేశంలో మొత్తం ఈ రైళ్ల సంఖ్య 50 దాటడం విశేషం.

# 'కేన్స్' తరలిపోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఒప్పించాలి: కేటీఆర్



తెలంగాణ రాష్ట్రం నుంచి పెట్టుబడులు తరలిపోతుండటంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కేన్స్ కంపెనీ గుజరాత్‌కు తరలిపోతున్నట్టు వార్తలు వస్తున్నాయని, ఆ కంపెనీ పెట్టుబడులను ఇక్కడే కొనసాగించేలా రాష్ట్రం ఒప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తన అధికారిక ఎక్స్ హ్యాండిల్‌లో ఒక పోస్టు పెట్టారు. కేన్స్ కంపెనీ గుజరాత్‌కు తరలిపోతున్నట్టు ఓ ఆంగ్ల పత్రికలో వచ్చిన వార్త క్లిప్పింగ్ ఆయన షేర్ చేశారు. 'రాష్ట్రం నుంచి పెట్టుబడులు తరలిపోతున్నాయి. రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు మేం చేసిన కృషి నిష్ఫలం అవుతున్నది. కేన్స్ కంపెనీ గుజరాత్‌కు వెళ్లిపోతున్నట్లు వార్తలు వస్తునాయి. ఎంతో ప్రయత్నించి కేన్స్ కర్ణాటక నుంచి తెలంగాణకు వచ్చేలా కన్విన్స్ చేశాం. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా ఆ కంపెనీని ఒప్పించాం. ఫాక్స్‌కాన్ దగ్గరలో ల్యాండ్ కావాలంటే 10 రోజుల్లోనే భూమి కేటాయించాం. కేన్స్ కంపెనీ వస్తే సెమీకండక్టర్ రంగంలో ఎంతో పురోగతి ఉంటుంది. పెట్టుబడులు ఇక్కడే కొనసాగించేలా కేన్స్ కంపెనీని రాష్ట్రం ఒప్పించాలి' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# మరోసారి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా వారిద్దరి పేర్లకు కేబినెట్ తీర్మానం



హైదరాబాద్: తెలంగాణలో గవర్నర్ కోటాకు సంబంధించి ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, మీర్ అమీర్ అలీఖాన్ నియమితులైన విషయం తెలిసిందే. మంగళవారం నాడు జరిగిన కేబినెట్ భేటీలో వీరిద్దరి పేర్లను ఖరారు చేస్తూ మంత్రులు తీర్మానం చేశారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాలతో మరోసారి కేబినెట్ తీర్మానం చేసినట్లు తెలుస్తోంది. వీరిద్దరి పేర్లను గవర్నర్‌కు తెలంగాణ ప్రభుత్వం పంపించనున్నట్లు సమాచారం. కాగా.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణలను ఎమ్మెల్సీలుగా మంత్రిమండలి నామినేట్ చేసింది. అయితే.. ఈ నిర్ణయాన్ని గవర్నర్ తమిళిసై తిరస్కరించిన విషయం తెలిసిందే. దీనిపై.. దాసోజు, కుర్ర సత్యనారాయణలు హైకోర్టును ఆశ్రయించారు. గవర్నర్ తన పరిధిని అధిగమించారని, మంత్రి మండలికి ఎమ్మెల్సీలను నామినేట్ చేసే హక్కు ఉందని పిటిషనర్లు హైకోర్టు దృష్టికి తెచ్చారు.

# అరుణాచల్ మాదే.. మీ పిచ్చివాదన వాస్తవాలను మార్చదు: చైనాకు భారత్ చురక

దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల అరుణాచల్‌ప్రదేశ్‌లో పర్యటించడంపై చైనా తన అక్కసు వెళ్లగక్కిన విషయం తెలిసిందే. 'జాంగ్‌నన్' ప్రాంతం తమ భూభాగమని, అక్కడ భారత్ వేస్తోన్న అడుగులు.. సరిహద్దు వివాదాన్ని మరింత క్లిష్టతరం చేస్తాయని డ్రాగన్ విదేశాంగ ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ నోరుపారేసుకున్నారు. ఈ విషయమై న్యూదిల్లీతో దౌత్యపరంగా నిరసనను తెలియజేసినట్లు పేర్కొన్నారు. దీంతో ఈ వ్యాఖ్యలకు భారత విదేశాంగ శాఖ దీటుగా బదులిచ్చింది. "ప్రధాని మోదీ అరుణాచల్ పర్యటనను ఉద్దేశిస్తూ చైనా చేసిన వ్యాఖ్యలను మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. భారత్‌లోని ఇతర రాష్ట్రాల మాదిరిగానే అరుణాచల్ ప్రదేశ్‌లోనూ మా నేతలు పర్యటనలు చేపడుతారు. ఈ పర్యటనలను వ్యతిరేకించడం, భారత అభివృద్ధి ప్రాజెక్టులపై అభ్యంతరం వ్యక్తం చేయడం సహేతుకం కాదు. ఇది వాస్తవాలను ఏమాత్రం మార్చదు. అరుణాచల్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే. ఈ విషయాన్ని చైనాకు ఇప్పటికే చాలాసార్లు స్పష్టంగా చెప్పాం" అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం అధికారిక ప్రకటనలో వెల్లడించారు. అరుణాచల్‌లో ఇటీవల ప్రధాని మోదీ పర్యటన చేపట్టిన విషయం తెలిసిందే. చైనా- భారత్ సరిహద్దులోని తవాంగ్‌కు సైనిక బలగాలను, సాయుధ సంపత్తిని తరలించేందుకు ఉపయోగపడే 'సేలా' సొరంగ మార్గాన్ని ఆయన ప్రారంభించారు. అయితే, ఈ రాష్ట్రాన్ని చైనా 'జాంగ్‌నన్ (దక్షిణ టిబెట్)'గా పేర్కొంటోంది. ఈ క్రమంలోనే మోదీ పర్యటనపై అక్కసు వెళ్లగక్కింది. అది తమ భూభాగమంటూ మళ్లీ పాత పాటే పాడింది. "జాంగ్‌నన్ ప్రాంతం చైనాలో భాగం. చట్టవిరుద్ధంగా ఏర్పాటుచేసిన అరుణాచల్‌ను మేం ఎన్నడూ గుర్తించలేదు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఇరుదేశాల సరిహద్దు సమస్య ఇంకా పరిష్కారం కాలేదు. జాంగ్‌నన్‌ను అభివృద్ధి చేసే హక్కు ఆ దేశానికి లేదు. చైనా- భారత్ సరిహద్దులోని తూర్పు ప్రాంతంలో ఆ దేశ ప్రభుత్వాధినేత పర్యటనపై తీవ్ర అసంతృప్తితో ఉన్నాం. ఈ విషయమై మా నిరసనను తెలియజేశాం" అని డ్రాగన్ పేర్కొనడం గమనార్హం.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660